# నాగరికత

రజని కాలనీలో అడుగుపెడుతూనే ఆశ్చర్యపోయింది. రెండేళ్ళలో ఎంత మార్పు? రాత్రి తొమ్మిదవుతున్నా పట్టపగలులాగే వుంది. రాములవారి గుడి రోడ్డులో వరసగా ట్యూబులైట్లు వెలుగుతున్నాయి - సైకిళ్ళు, స్కూటర్లు సర్రు సర్రున పోతున్నాయి. గుడిలో గంట ఎవరో మోగించారు.

రజని చకచకా నడుస్తోంది. రెండేళ్ళ క్రితం తను యిక్కడి కొచ్చినప్పుడు పొందిన భయాందోళనలు ఎప్పటికీ తను మర్చిపోలేదు. ఊహించలేనంతగా ఇక్కడ ఇంత డెవలప్ అయిపోయింది. పెద్ద డిపార్టుమెంట్ స్టోర్సు - కూల్‌డ్రింక్సు షాపు - మధ్యలో ఖాళీ స్థలాలు లేకుండా వరుసగా అందంగా కట్టిన యిళ్ళూ - ఎన్ని రకాల డిజైన్లు - ఒక్కొక్క ఇల్లూ ఒక్కొక్క సినిమా సెట్టింగ్‌లా వుంది. దూరంగా టీ.వీ.లోంచి సల్మా సుల్తానా గొంతుకలో హిందీ న్యూస్ వినిపిస్తోంది. తను పూర్వ మొచ్చినపుడు కట్టివున్న ఇళ్ళు, వీటిముందు వెలా తెలాబోతూ పాతబడినట్లు కనిపిస్తున్నాయి. పూర్వం వచ్చినప్పుడు ఎంత భయపడిందో ఇప్పుడు అసలు భయమేయడం లేదు. మొన్న అక్క చెప్పింది. అప్పుడు కాబట్టి ఎలాగో కొనగలిగారు కాని, ఇప్పుడైతే అదే స్థలం గజం నాలుగు వందలు చొప్పున పలుకుతోంది ధర. ఈ పెరిగిన నాగరికత చూసి వుబ్బి తబ్బిబ్బయిపోతూ నడుస్తుంటే పోయినసారి తనొచ్చినప్పుడు పొందిన అనుభూతి పాత సినిమా చూస్తున్నట్లు కళ్ళముందు కదలడం మొదలుపెట్టింది. రజని నెమ్మదిగి నడుస్తూ గతంలోకి వెళ్ళిపోయింది.

❖ ❖ ❖

ఆ రోజు రజని బస్సు దిగేసరికి సరిగ్గా తొమ్మిది గంటలు కొట్టారు. రజని దిగీ దిగగానే దూసుకు వెళ్ళిపోయింది బస్సు. చుట్టూ నిర్మానుష్యంగా వుంది. అది కొత్తగా నిర్మించబడుతున్న కాలనీల ఏరియా.

దూరం దూరంగా ఇళ్ళు – ఇళ్ళల్లోంచి లైట్ల వెలుగు భయాన్ని వెంటనే ధైర్యాన్ని కలగాపులగంగా అందిస్తున్నాయి. చేరేసరికి రాత్రి తొమ్మిదవుతుందని రజని అనుకోలేదు. ప్రయాణం మధ్యలో బస్సు చెడిపోయి గంటన్నర ఆగిపోయింది. తీరా వూరు చేరాక ఆటో ఎక్కడానికి భయమేసింది. చచ్చినట్లు సిటీబస్సుకోసం ఎదురుచూసి, ఇక్కడికి చేరేసరికి ఇంత ఆలస్యమైంది.

రజని చకచకా అడుగులు వేస్తోంది. అక్కడో మనిషి, ఇక్కడో రిక్షా. అయిదు నిముషాల కొక బస్సు, ఒక లారీ వెళ్తున్నాయి.

అదిగో రాములవారి గుడి – దాన్ని ఆనుకున్న రోడ్డులో మొదటి లైను- మొదటిలైను అనే మటే గానీ సుమారు రెండు ఫర్లాంగులు నడవాలి. మెయిన్ రోడ్డుమీద లైట్లు వున్నాయిగానీ, రాములవారి గుడి రోడ్డులోకి తిరగగానే వీధి దీపాలు లేవు. ఇంకా వెయ్యలేదట –

రజని ఎడం చేతిలోంచి బ్యాగ్ కుడిచేతిలోకి మార్చుకుంది. అందులో వేసుకున్నవి రెండే జతలైనా బరువుగా అనిపిస్తోంది. భయంతో, కాళ్ళూ నడవగలిగినంత వేగం పుంజుకోలేక గుండెలు బరువెక్కిపోతున్నాయి.

క్రమంగా చీకటికి అలవాటుపడ్డ కళ్ళు రోడ్డుమీద జాగ్రత్తగా చూస్తున్నాయి – ఎంత నడిచినా దూరం దగ్గరవటల్లేదనిపిస్తోంది. ఆ క్షణంలో రజనికి వాళ్ళక్క కామాక్షి మీద విపరీతమైన కోపమొచ్చింది. ఇల్లు కట్టుకున్నవాళ్ళు హాయిగా ఊరు మధ్యలో కట్టుకోక ఇక్కడ కట్టుకున్నారెందుకో – ఎవరేనా రావాలన్నా, వాళ్ళకేదైనా కావాలన్నా ఎంత కష్టం? బొత్తిగా కామన్‌సెన్స్‌లేదు. వీళ్ళసలు నాగరికులేనా – ఇంత నిర్మానుష్య మైన చోట ఎంత పెద్ద ఇల్లు కట్టుకుంటే మాత్రం ఏమి సుఖం? ఎవరేనా వచ్చి గొంతు పిసికినా దిక్కులేదు. రజని ఆలోచిస్తూండగానే ఎవరో ఒకతను ఎదురుగా వస్తూ కనిపించాడు. మనిషి కొంచెం తూలుతున్నట్టుగా కూడా అనిపించి, రజని గజగజ వొణికిపోవడం మొదలెట్టింది. అది నడకో, పరుగో తెలీకుండా రజని గాలిలో ఎగురుతోంది – మెళ్ళో గొలుసు ఒక చేత్తో గట్టిగా పట్టుకుంది. భుజం మీంచి వేలాడుతున్న బ్యాగ్ బరువును కూడా లెక్కచేయకుండా, మరో చేత్తో చీర కుచ్చెళ్ళు

కాస్త పైకి పట్టుకుని పరుగెడుతోంది. మళ్ళీ అంతలోనే తనలా పరుగెట్టడం ఆ మనిషి చూస్తే వెంటపడతాడేమోనని - రెండడుగులు కాస్త నెమ్మదిగా వేసి, మళ్ళీ పరుగు - అంతలో ఒక కొత్తగా కడుతున్న యింటిముందు - వెదురుగడకి వేలాడదీసిన బల్బు కాంతిలో చరచరా రోడ్డుకి అడ్డంగా పాకుతూ కనిపించింది పాము - ఎటు తప్పుకుందామన్నా ఒకవైపు ఇటుకల గుట్ట, మరొకవైపు ఇనుపచువ్వలు - అలాగే ఒక్కక్షణం కదలకుండా వణికిపోతూ నిలబడిపోయింది - పాము రోడ్డును దర్జాగా దాటి తుప్పల్లోకి వెళ్ళిపోయింది. రజని గొంతులోంచి దుఃఖం గరగరమంటోంది. కళ్ళల్లో నీళ్ళు బయటపడదానికి మొహమాటపడుతున్నాయి. ఆ సగం కట్టిన ఇంటి ముందు ఎవరో చుట్ట కాల్చుకుంటూ కూర్చుంటే చూసి కాస్త ధైర్యం తెచ్చుకుంది. ఒక్క క్షణం ఆగింది - వెనక్కి ముందుకి చూసింది. తను గృహ ప్రవేశానికొచ్చింది. మళ్ళీ రాలేదు. తను దారి తప్పలేదు కదా! అనే సందేహం రాగానే మళ్ళీ భయం నిలువెల్లా ముంచేసింది.

రజని నిలకడగా నిలబడి అటూ ఇటూ చూడడం చూసి ఆ చుట్ట ఆసామి "ఎవరండీ" అన్నాడు.

"పతంజలి గారిల్లు...." అంటూ పూర్తి వివరాలు చెప్దామంటే నోట్లోంచి మాట పెగిలిరాలేదు.

"రైల్వేలో పని చేస్తారాండీ?" అన్నాడతను.

"అవును" అంది.

"ముందకెళ్ళి ఎడంవైపు తిరగండి అక్కడ ఆ రొక్కరిదే యిల్లు" అన్నాడు.

రజని మళ్ళీ నడక మొదలుపెట్టింది. అది క్రమంగా పరుగులా మారింది.

రజని ఇంటి ముందాగి, గేటులోంచి లోపలికి ఒక్క గెంతు గెంతి మెడలోంచి చెయ్యి తీసింది. చీర చెంగు వదిలింది. గుప్పెట్లు విప్పితే చెమట - భయం వొళ్ళంతా ముద్దయినట్లుంది.

అక్క కామాక్షి కౌగిలించుకున్నంత పనిచేసింది. బావగారు భాస్కరం "ఇంత పొద్దు పోయింది. చూసి చూసి ఇంక రావేమో అనుకుంటున్నాం. అయినా కరెక్ట్‌గా దేనికి వస్తున్నదీ రాస్తే నే వచ్చే వాడినిగా" అన్నాడు.

వరండాలో తళతళలాడుతున్న బజాజ్ బండిని చూసి "ఓహో! బావగారికి వాహనయోగం పట్టిందని నాకేం తెలుసు?" అంటూ సాగదీసింది. కాసేపు అక్కగారిని సాధించి పోసింది, అంత దూరంలో ఇల్లు కట్టుకున్నందుకు.

"మీ ఇంటికి రావలంటే అడవిలోకి వచ్చినట్లే" అని తేల్చింది చివరికి.

"మంచిదానివిలే, కొత్తగా స్థలం కొనుక్కుని ఇల్లు కట్టుకోవాలనుకుంటే లీలామహల్ పక్కన స్థలం దొరుకుతుందిటే – నీ పిచ్చిగాని మాకు హాయిగా వుంది. పైగా ఎంతలోకి డెవలప్ అవుతుందీ? చూస్తుండగా అన్నీ వచ్చేస్తాయి. అప్పుడే మా సందు చివర ఓ కిళ్ళీ కొట్టు వెలిసింది తెలుసా" అంది ఎంతో స్వాభిమానంగా.

సొంత ఇల్లు కట్టుకున్న వారెవరైనా అలాగే అంటారు. అదెక్కడ వున్నా అది వారికి స్వర్గం. అందుకే సమర్థించుకుండా వుండలేరు. వున్న విషయమైనా ఎవరైనా ఏదైనా అంటే సహించలేరు.

"చాలుగాని త్వరగా స్నానం చేసిరా! నీ కోసం వంకాయలు పులుసు పచ్చడి. కందిపచ్చడి వేసి, అరటికాయలు గలగలా వేయించాను" అంది కామాక్షి.

"ఇదిగో మరదలా! వంకాయలు యింట్లో తోటలో పండించాం తెలుసా! అరటి సరే సరి." అన్నాడు భాస్కరం.

అంతవరకు అనుభవించిన భయం, అలసట, విసుగూ అన్నీ మర్చిపోయి, ఆనందంగా స్నానానికెళ్ళిపోయింది రజని.

❖ ❖ ❖

రజని ఆలోచనల్లోంచి ఒక్కసారి ఉలిక్కిపడి వాస్తవంలోకి వచ్చింది. వీధిలో లైట్లు వెలుగుతూనే వున్నాయి. ఇళ్ళల్లో జనం తిరుగుతున్నట్లే ఉంది – ఎవరో వేగంగా సైకిల్‌మీద దూసుకురావడం, రజని మెడలో గొలుసు తెంపడం క్షణంలో జరిగి పోయాయి.

"దొంగ! దొంగ! అయ్యో నా గొలుసు... గొలుసు" అంటూ అరిచినా, రజని అరుపులు జనారణ్య రోదనలే అయ్యాయి.

టీ.వీ.లోంచి వస్తున్న రసవత్తరమైన సీరియల్‌లో "బచావో! బచావో" అంటూ కథానాయిక అరచిన అరుపుల్లో బహుశ రజని అరుపులు కలిసిపోయి వుండవచ్చు. ఏ ఇంట్లోంచి ఎవ్వరూ బయటికి రాలేదు. అన్ని ఇళ్ళల్లోనూ లైట్లు వెలుగుతూనే వున్నాయి. వీధంతా కలకల్లాడుతూనే వుందిగాని రజని మనసు అంధకారమైపోయింది. భయంతో కొత్తగా వేసిన తారు రోడ్డు మీద ఒక్క పరుగుతీసి యింట్లో పడి అక్కగార్ని కౌగలించుకొని భొల్లుమంది రజని. మెడమీద గోరు గిచ్చుకున్న గాయం జవ జవ సలిపెయ్యడం మొదలుపెట్టింది.

అయిదు నిముషాల తర్వాత అంతా పోగ్రై అయ్యో అంటే అయ్యో అన్నారు. పెరుగుతున్న నాగరికతలో ఇది ఒక భాగం అని కొందరు వ్యాఖ్యానించారు. నిర్మానుష్యంగా వుండి తనెంతో భయపడినప్పుడు తనకేం జరగలేదు. వీధంతా దీపాలతో కలకల్లాడుతూ వుండగా తన మెడలో గొలుసు దొంగ ఎలా ఎత్తుకుపోయాడా అంటూ వాపోయింది రజని.

●